శరవేగంగా అభివృద్ధి పనులు

- 44వ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో పనులు
- మారిన డివిజన్ రూపురేఖలు
- రూ.13 కోట్లతో స్టేడియం నిర్మాణం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధికి చిరునామాగా గట్టు వెనుక ప్రాంతంలోని 44వ డివిజన్ నిలిచింది. గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి అంటే ఏమిటో తెలియని డివిజన్ ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు జరిగిన, జరుగుతున్న పనులు చూస్తుంటే అభివృద్ధి అంటే ఇది కదా అని అనిపిస్తుందని డివిజన్ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో అభివృద్ధి పనుల పేరుతో శంకుస్థాపనలే తప్ప అవి పూర్తయ్యి ప్రారంభోత్సవాలు జరిగిన దాఖలాలు లేవని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. డివిజన్ పరిధిలోని సమస్యలను స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి ఎప్పటికప్పుడు తెలుసుకుని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే అంచనాలు వేయించి నిధులు మంజూరు చేయించడంతోనే ఊహించని విధంగా కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయి. దీంతో డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చురుగ్గా స్టేడియం నిర్మాణం

విద్యాధరపురం ఆర్టీసీ డిపో పక్కన కార్మిక శాఖకు చెందిన సుమారు 9 ఎకరాల స్థలంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం స్టేడియం నిర్మాణానికి చేపట్టింది.


నిర్మాణంలో ఉన్న స్టేడియం



పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న వెలంపల్లి శ్రీనివాసరావు ఇందుకు కారణం, ఆయన చూపిన ప్రత్యేక శ్రద్ధతోనే నియోజకవర్గంలోని క్రీడాకారుల చిరకాల కోరిక సాకారం కానుంది. స్టేడియం నిర్మాణానికి మొత్తం రూ.13 కోట్లు కేటాయించగా మొదటి విడతలో విడుదలయిన రూ.6 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో క్రీడా స్టేడియంగా రూపొందనున్న ఇందులో ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలకు ఏర్పాట్లు చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయకుండానే ఎన్నికలకు ముందు చంద్రబాబు హడావుడిగా శిలాఫలకం ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని క్రీడాకారులు గుర్తు చేస్తున్నారు. స్టేడియం నిర్మాణం పూర్తయితే వివిధ క్రీడల్లో శిక్షణ పొంది జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని వారు పేర్కొంటున్నారు.

అన్నీ సీసీ రోడ్లే..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో 44వ డివిజన్‌లో అన్నీ సీసీ రోడ్లే నిర్మించటం గమనార్హం. డివిజన్ పరిధిలోని లేబర్‌కాలనీలో రూ.23 లక్షల వ్యయంతో కొత్త డ్రెయిన్ నిర్మాణం, చెరువు సెంటర్ కొండ ప్రాంతంలో రూ.60 లక్షలతో కొత్త డ్రెయిన్లు, మెట్లకు మరమ్మతులు, అదే విధంగా చెరువు సెంటర్‌లో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, వడ్డెరవారి వీధి కొండ ప్రాంతంలో రూ.36 లక్షలతో, నాలుగు స్తంభాల సెంటర్‌లో రూ.36 లక్షలతో కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు జరిగాయి. అలాగే కేసీ పబ్లిక్ స్కూల్ రోడ్‌లో రూ.45 లక్షలతో సీసీ రోడ్లు, గంజి యలమంద వీధి, మువ్వలవారి వీధిలో రూ.43 లక్షలతో, రూ.74 లక్షలతో పార్థసారథి వీధి, రూ.42 లక్షలతో యద్దనపూడివారి వీధిలో సిమెంట్ రోడ్ల నిర్మాణం జరిగాయి. కోటి రూపాయలతో నాలుగు స్తంభాల సెంటర్ కొండపై కొత్త మెట్లు, డ్రెయిన్లు, రిటైనింగ్‌వాల్స్ పనులు పూర్తయ్యాయి. ఇంకా రూ.1.60 కోట్ల నిధులు మంజూరు కావల్సి ఉంది. డివిజన్‌లో అన్నీ సీసీ రోడ్లే నిర్మించటం విశేషం.


గంజి యలమందయ్య వీధి

అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ..



గత ప్రభుత్వంలో పూర్తిగా విస్మరించిన డివిజన్ అభివృద్ధిని జగనన్న ప్రభుత్వం ద్వారా సాధించడం ఒక కార్పొరేటర్‌గా గర్వంగా ఉంది. విజయవాడ నగర అభివృద్ధిపై జగనన్న ప్రత్యేక శ్రద్ధ చూపటం, అందుకు కావల్సిన నిధులను పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు రాబట్టటంతోనే డివిజన్‌లో ఇంత అభివృద్ధి చేయగలిగాం. నిర్మాణంలో ఉన్న స్టేడియం స్థలం కూడా నా డివిజన్ పరిధిలోనే ఉండటం అదృష్టంగా భావిస్తున్నాను. స్టేడియం నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి.

– మైలవరపు రత్నకుమారి,
44వ డివిజన్ కార్పొరేటర్

'జిలానీఖాన్ సేవలు వెలకట్టలేనివి'



విజయవాడకల్చరల్: సాంస్కృతిక రంగానికి జిలానీఖాన్ చేసిన సేవలు వెలకట్టలేనివని సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. నగరానికి చెందిన కళాకారులు, సాహితీ సంస్థల నిర్వాహకుడు జిలానీఖాన్ మృతికి నగరానికి చెందిన కళా సంస్థల ప్రతినిధులు గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళా వేదికపై ఆదివారం సంతాప సభను నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ జిలానీఖాన్ పేద కళాకారుల కోసం అనేక కార్యక్రమాలను నిర్వహించారని, వారికి ప్రతీ నెల నిత్యావసరాలను పంపిణీ చేశారని తెలిపారు. సంతాప సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చిట్టిబాబు, రమాశంకర్, వీరభద్రరావు, మారేపల్లి జోషి, పి.శ్రీనివాసరావు, ఆదిరాల జయప్రభ పాల్గొన్నారు.

మురుగు కాల్వలో పడి తాపీ మేస్త్రి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబేకాలనీ సీ బ్లాక్‌కి చెందిన చిన్నం రవి(47) అనే తాపీ మేస్త్రి రవీంద్రభారతి స్కూల్ ఎదురుగా ఉన్న డ్రెయినేజీ కాల్వలో పడి మృతి చెందాడు. దీంతో పోలీసులు ఆదివారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. తాపీ పని చేస్తున్న చిన్నం రవి శనివారం పనికి వెళ్లి రాత్రికి ఇంటికి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఎటువంటి సమాచారం లేదు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు రవీంద్రభారతి స్కూల్ వద్ద డ్రెయినేజీ కాల్వలో పడి ఉన్న రవి మృతదేహాన్ని గుర్తుపట్టారు. మృతుని భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న షేక్ ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు ; మాట్లాడుతున్న షేక్ ఆసిఫ్, పక్కన కార్పొరేటర్లు

పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ కోరారు. పశ్చిమ నియోజకవర్గం 39వ డివిజన్‌లో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ గుడివాడ నరేంద్రతో కలిసి ఆదివారం పర్యటించారు. సంజీవ గాంధీ కాలనీలో ఇంటింటికి వెళ్లారు. ప్రతి ఒక్కరిని పలుకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పార్టీ రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పర్యటనలో తన దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులకు తెలియజేసి వాటిని తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతుందన్నారు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని చెప్పారు. మరలా వైఎస్ జగన్‌ను సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పడిగిపాటి చైతన్య రెడ్డి, పార్టీ నాయకులు మైలవరపు దుర్గారావు, జీఎంసీ బాషా, డీవీ రెడ్డి, పి.సుబ్బారెడ్డి, ఏలూరు వెంకన్న, సాయిబాబు, వి.శ్రీను, ముంతాజ్ బేగం, సంకా పరమేష్, అంబడపూడి శ్రీకాంత్, రేలంగి బుజ్జి, కరీముల్లా, గృహ సారథులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయటమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల లక్ష్యమని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు, ముఖ్యనాయకుల సమావేశం పాతబస్తీలోని మాడపాటి క్లబ్ ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పరుగులు తీస్తున్నాయన్నారు. మహిళా సాధికారతలో దేశంలోనే ముందు వరుసలో ఉన్నామన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా చేయటానికి తమందరం కలిసి పని చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. పార్టీని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు.

ఆసిఫ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలి

పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిది అని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. సాధారణ కార్యకర్తగా, కార్పొరేటర్‌గా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పలు పదువులు చేసిన షేక్ ఆసిఫ్‌ను జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేశారన్నారు. వారిని గెలిపించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మండేపూడి ఛటర్జీ, చైతన్యరెడ్డి, అర్షద్, పూర్ణ, రాయన నరేంద్ర, ఆంజనేయరెడ్డి, కోటిరెడ్డి, రెహమతున్నీసా, మైలవరపు రత్నకుమారి, బుల్లా విజయకుమార్, అత్తులూరి పెదబాబు, మహాదేవు అప్పాజీరావు, యలకల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నగర వాసులకు జాతీయ స్థాయి పురస్కారాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడ నగరానికి చెందిన మేడా సింధుశ్రీ, లంకే లోకేష్ బాబుకు తెలుగు వెలుగు సంస్థ అందజేసే జాతీయస్థాయి పురస్కారాలు దక్కడం చాలా సంతోషంగా ఉందని స్ఫూర్తి క్రియేటివ్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. చిత్రలేఖనం, క్రియేటివ్ క్రాఫ్ట్స్, పేపర్ క్విల్లింగ్ అంశాల్లో ప్రతిభ చూపినందుకు సింధుశ్రీకి తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం, ఫొటోగ్రఫీ, విజువల్ కమ్యూనికేషన్ రంగంలో ప్రతిభ చూపినందుకు లంకే లోకేష్‌బాబుకు తెలుగు వెలుగు స్ఫూర్తి కళారత్న జాతీయ పురస్కారాలు అందుకున్నారన్నారు.

అవార్డుల అందజేత

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఏటా ఈ పురస్కారాలను అందిస్తారని వివరించారు. తెలంగాణలోని యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హన్మకొండలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాలను సింధుశ్రీ, లోకేష్‌లకు అందజేశారని శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక వ్యవస్థాపక చైర్మన్ పాలోజు రాజ్‌కుమార్, తెలుగు వెలుగు వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ రంగిశెట్టి రమేష్, యువత చైతన్య వెల్ఫేర్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొని ఈ అవార్డులను అందజేశారని చెప్పారు.


అవార్డులు పొందిన మేడా సింధూశ్రీ, లోకేష్ బాబు

ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు


ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణానదిలో ఆదివారం స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. 24వ కృష్ణా రివర్ క్రాస్ 1.5 కిలోమీటర్ల ఈత పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సందే @ స్మృతివనం



నగరంలోని బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలో సందడి నెలకొంది. ఆదివారం పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో స్మృతివనం ప్రాంగణమంతా కిటకిటలాడింది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవిత విశేషాల దృశ్యాలు, వివిధ ఆకృతులను సందర్శకులు తిలకించారు. సాయంత్రం స్మృతివనం విశేషంగా ఆకట్టుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ




సామాజిక సేవలు విస్తృతం చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాసవీ క్లబ్‌ల పాలకవర్గాలు సామాజిక సేవలను మరింత విస్తృతం చేయాలని ఆ క్లబ్‌ల అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. వాసవీ జిల్లా 212 పరిధిలోని వివిధ క్లబ్‌లు అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారుల శిక్షణా తరగతులు వన్‌టౌన్‌లోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వేముల హజరత్తయ్యగుప్తా మాట్లాడుతూ.. క్లబ్ నిర్వాహకులు క్రమశిక్షణతో, నిర్మాణాత్మకంగా, కులమతాలకు అతీతంగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు అవసరమైన సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. క్లబ్ జిల్లా గవర్నర్ కె.సతీష్ మాట్లాడుతూ.. క్లబ్ పనితీరుతో అందరి ప్రశంసలందుకోవాలన్నారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్లు అనిల్‌కుమార్, చెన్నకేశవులు, అంజని శ్వేత, వేంకటేశ్వర్లు, క్లబ్‌ల ప్రముఖులు సంతోష్ చక్రవర్తి, బొడ్డు శ్రీనివాసరావు, సురేష్, రోజా, శివకుమార్ పాల్గొన్నారు.


హజరత్తయ్యగుప్తాను సత్కరిస్తున్న క్లబ్ ప్రముఖులు

చాంద్ తారా ప్యానల్ విజయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని మోతీ మసీదు కమిటీ ఎన్నికల్లో చాంద్ తారా ప్యానల్ విజయం సాధించింది. షాదీఖానా ఆవరణలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 594 ఓట్ల గాను 546 ఓట్లు నమోదయ్యాయి. సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు జరగగా ఎండీ బాషాకు చెందిన చాంద్ తారా 80 ఓట్ల మెజారిటీతో గెలుపొందింది. ఎన్నికల అధికారి ఫతావుల్లా విజయం సాధించిన చాంద్ తారా సభ్యులకు డిక్లరేషన్ పత్రాన్ని అందజేశారు. పోలింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కొత్తపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మోతీ మసీదుతో పాటు షాదీఖానా అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఎండీ బాషా పేర్కొన్నారు.


గెలుపొందిన ప్యానల్‌కు డిక్లరేషన్ అందజేస్తున్న ఎన్నికల అధికారి

కళారూపాలను ఆదరించాలి

విజయవాడకల్చరల్: జానపద కళారూపాలను ఆదరించాలని గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. దామోదర జానపదం, మామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం జానపదం– సినీ పదం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రమైక జీవనంలోనే ఆట పాట ఉందన్నారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు మాట్లాడుతూ సంస్థ ద్వారా ఎందరో కళాకారులను వెలుగులోకి తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో మహంతి వాసుదేవరావు, గిరిజన గీత శిల్పి బొండా జగన్మోహనరావు, డాక్టర్ కొండా వేణుగోపాలరెడ్డి పాల్గొని ప్రసంగించారు.

- హనుమాన్‌జంక్షన్ రూరల్: నిస్వార్థంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థకు ప్రతి ఒక్కరూ సాయం అందించాలని దాత అల్లం దుర్గారావు అన్నారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖకు ఆయన రూ.33 వేలు విరాళాన్ని ఆదివారం అందించారు. ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావుకు నగదును దుర్గారావు అందజేశారు.

క్లుప్తంగా

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును బాధిత కుటుంబానికి స్థానిక శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు అందజేశారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో సంబంధిత చెక్కును వెలంపల్లి శ్రీనివాసరావు ఆదివారం అందించారు. 51వ డివిజన్‌కు చెందిన పిళ్లా దుర్గారావు ఇటీవల గుండెకు ఆపరేషన్ చేయించుకున్నాడు. దాంతో పాటుగా ఇతర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే ఎమ్మెల్యే వెలంపల్లి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ మెంబర్ మరుపిళ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు

నేడు వీఎంసీ 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారికి అవసరమైన రక్తాన్ని దానం చేసేందుకు యువత ముందుకు రావాలని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. విద్యార్థి నాయకుడు దాడి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం చిట్టినగర్‌లోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ బ్లడ్ సెంటర్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన శిబిరానికి పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పలువురు యువకులు విచ్చేసి రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకుడు దాడి జగన్, వ్యాపారవేత్త రవీంద్రనాథ్‌రెడ్డి, చిల్లా వెంకటేష్‌రెడ్డి, హుస్సేన్, రమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దత్తపీఠంలో ఉచిత వైద్యశిబిరం



పటమట(విజయవాడతూర్పు): పటమటలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమం దత్తపీఠంలో ఆదివారం భక్తులకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సౌజన్య హాస్పిటల్స్ సౌజన్యంతో వైద్యులు ఆకెళ్ల సూర్యనారాయణ, లక్ష్మీ సౌజన్య, మనోజ్, సావిత్రి డాక్టర్ల బృందం వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, స్త్రీ సంబంధిత వ్యాధులకు, సుగర్, బీపీ, థైరాయిడ్, జ్వరాలు తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

గుడ్ విషెస్‌తో మనో ధైర్యం



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పిటల్, రెడ్ ఎఫ్ఎం ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీ రోడ్డులోని పీవీపీ మాల్‌లో ది పవర్ ఆఫ్ గుడ్ విషెస్ అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తొలుత రెడ్ ఎఫ్ఎం ఆర్‌జేలు ఇస్మార్ట్ స్వీటీ, అన్యలు మాల్‌కు వచ్చిన వారి దగ్గర నుంచి గుడ్ విషెస్ తీసుకుని ఎఫ్ఎంలో ప్రసారం చేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్ నిపుణులు డాక్టర్ వీఎస్ఎన్ రావు మాట్లాడుతూ.. ప్రేమతో మీరు బాగుండాలని అని చెప్పే మాటలు ఎంతో మనోధైర్యాన్నిస్తాయన్నారు. ఇలాంటి కార్యక్రమం క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి మనోధైర్యం ఇవ్వడంతో పాటు క్యాన్సర్‌పై అవగాహన పెంచుతుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రంగనాథ్, టి.యువకిషోర్, రెడ్ ఎఫ్ఎం స్టేషన్ హెడ్ క్రాంతికుమార్, ప్రోగ్రామింగ్ హెడ్ ఆదిల్ బాషా పాల్గొన్నారు.